క్లుప్తంగా

తెలుగు వారికి ప్రాధాన్యత ఇవ్వాలి

వేంపల్లె : టీటీడీ వేద పారాయణ పోస్టుల భర్తీలో తెలుగు ప్రాంత బ్రాహ్మణులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆ మేరకు ఆదేశాలు జారీ చేయాలని సీఎం చంద్రబాబుకు బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు వి.ప్రసాదరావు, సూగురు రఘునాథరావులు విజ్ఞప్తి చేశారు. టీటీడీలో వేద పారాయణ పోస్టుల భర్తీకి టీటీడీ చర్యలు చేపట్టడంతో బ్రాహ్మణులలో ఆశలు ఉండేవని, అయితే డిప్యూటీ ఈవో, కార్యాలయ ఓఎస్డీ గోవిందరాజన్ గోల్‌మాల్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

యూరియా కొరతను తీర్చాలని వినతి

పులివెందుల టౌన్ : రాష్ట్రంలో యూరియా కొరతను తీర్చాలని, ఎరువుల కేటాయింపులలో ఆర్‌ఎస్‌కే, సొసైటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ ఏరియా కార్యదర్శి వెంకటరాములు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మినీ సెక్రటేరియట్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న ఆర్డీఓ చిన్నయ్యకు సీపీఐ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



రెయిలింగ్‌పైకి ఎక్కిన బస్సు

వల్లూరు : తప్పెట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు బుధవారం ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. బస్సు సాయంత్రం విద్యార్థులను తీసుకెళ్తుండగా ప్రమాదానికి గురైంది. మద్యం మత్తులో వున్న డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో వంతెన సమీపంలో వున్న సైడ్ సేఫ్టీ ఎస్‌ఎస్ రెయిలింగ్‌పైకి ఎక్కి ఒక పక్కకు ఒరిగింది. పలువురు విద్యార్థులకు స్వల్పంగా గాయాలయ్యాయి. బస్సు డోర్ నుంచి విద్యార్థులు బయటకు రావడానికి వీలు లేక పోవడంతో వెనుక నున్న అద్దాలను పగులగొట్టి వారిని సురక్షితంగా బయటకు తీశారు. బ్రిడ్జికి ఇరువైపులా సేఫ్టీ రెయిలింగ్ ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

క్రీడా దుస్తుల వితరణ

జమ్మలమడుగు : బాల్ బాడ్మింటన్‌కు ఎంపికైన జట్టు క్రీడాకారులకు సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి బుధవారం యూనిఫాం వితరణ చేశారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో రెండు రోజులు క్యాంపు నిర్వహించారు. ఎంఈఓ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ ఓబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హెచ్‌ఐవీపై అవగాహన

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సుఖవ్యాధులతోపాటు హెచ్‌ఐవీపై చైతన్య ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ నరేష్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకిన వారు ఏఆర్‌టీ మందులు తీసుకుని వాడటం వల్ల ఆరోగ్యంగా ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. 1097 టోల్ ఫ్రీ నంబర్‌కు హెచ్‌ఐవీ సోకిన వారు త మ అనుమానాలు నివృత్తి చేసుకోవాలన్నా రు. 2017 సవర్ణ చట్టం హెచ్‌ఐవీ సోకిన వారికి అండగా ఉంటుందన్నారు. హెచ్‌ఐవీ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఏఐటీయూసీలో చేరిన సీఐటీయూ నాయకురాళ్లు

వేంపల్లె : వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న సీఐటీయూలో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు ఏఐటీయూసీలో చేరారు. బుధవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్.మంజుల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎ.సి.బాదుల్లా సమక్షంలో ప్రాజెక్టు యూనియన్ నాయకురాళ్లు ప్రభావతి, శైలజ, లక్ష్మీదేవి, నాగేశ్వరి, రమణమ్మలతోపాటు చక్రాయపేట మండలంలోని లలిత, శ్రీవాణి, ముంతాజ్, శాంతి, పార్వతి, రత్న, సౌదామణి, అంజనమ్మ, శైలజ, గంగాదేవి, అంగన్వాడీ వర్కర్లందరూ ఏఐటీయూసీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలుగా శాంతకుమారి, ఉపాధ్యక్షులుగా శ్రీవాణి, ప్రధాన కార్యదర్శిగా బి.లలిత, సహాయ కార్యదర్శిగా ప్రశాంతి, కోశాధికారిగా ఎస్.విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు.

వీఎన్‌పల్లె వాసికి గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెలుగోటి చిన్న నాసరమ్మ

వీరపునాయునిపల్లె : నేచురోపతి, యోగ, పోషకాహారం విభాగంలో డాక్టర్ ఎన్.టి.ఆర్ హెల్త్ యూనివర్శిటీ వీరపునాయునిపల్లె గ్రామానికి చెందిన వెలుగోటి చిన్న నాసరమ్మకు గోల్డ్‌మెడల్ అవార్డు ప్రదానం చేసింది. విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు.

పతనమైన పంట ఉత్పత్తుల ధరలు

- ఆవేదనలో రైతులు
- కరోనా విపత్కర సమయంలో కూడా ఇలాంటి పరిస్థితి లేదంటున్న రైతులు



పొలంలో ఉల్లి పంటను నూర్పిడి చేసిన రైతు



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న టమాట



చీనీ కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

లింగాల : రైతులు పండించే ప్రతి పంట అతి దారుణంగా ధరలు పడిపోయి రైతులు లబోదిబోమంటున్నారు. పంట పండించడానికి లక్షలాది రూపాయలు ఖర్చు పెడితే వేలాది రూపాయలు కూడా పంట దిగుబడిపై ఆదాయం అందలేదు. దీంతో రైతులు ఏమి పండించాలో, ఏమి తినాలో అని దిగాలు చెందుతున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సాగు చేసిన అరటి, చీనీ, మిరప, ఉల్లి, టమోట ధరలు పూర్తిగా క్షీణించిపోయాయి. నెల రోజుల క్రితం గిట్టుబాటు ధరలు లభించగా, ప్రస్తుతం పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే నాథుడు లేక రైతులు దిగాలు చెందుతున్నారు.

కంట కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి :

ఉల్లి ధరలు దారుణంగా పడిపోయాయి. క్వింటా ఉల్లి ధర రూ.600ల నుంచి రూ.800లు పలుకుతోంది. దీంతో పంట సాగు చేసేందుకు ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చు చేస్తే దిగుబడి ఆశించిన మేర వచ్చినా పంట నూర్పిడికి అయ్యే కూలీ ఖర్చులు కూడా అందడంలేదని ఉల్లి రైతుల కంట కన్నీరు తెప్పిస్తోంది.

అరటి కాయలను కొనేనాథుడే లేరు :

అరటి కాయల ధరలు పాతాళానికి పడిపోయాయి. కరోనా సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను కనీసం ఆదుకునేందుకు టన్ను అరటి కాయలను రూ.4 వేలకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి ప్రజలకు పంపిణీ చేశారు. ప్రస్తుతం అరటి కాయలు టన్ను రూ.3 వేలకు కూడా కొనుగోలు చేసే నాథుడు లేరని రైతులు వాపోతున్నారు.

కారం తగ్గిన మిరప :

పచ్చి మిరప పంటను మండలంలో విస్తారంగా సాగు చేశారు. అయితే పంట కోసిన కూలీలకు కూడా ఆదాయం రాకపోవడంతో 50 కేజీల బస్తాను తోట వద్దనే వ్యాపారులకు వారే కోసుకునేలా రూ.130లకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విపరీతమైన తెగుళ్ల నివారణకు పురుగు మందులను పిచికారి చేయడమేకాకుండా రసాయనిక ఎరువుల వాడకం, కలుపు నివారణ వంటి వాటికి కూడా గిట్టుబాటు కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

చీనీ ధరలు పతనం :

చీనీ ధరలు పూర్తిగా పతనమయ్యాయి. ఒకవైపు దళారులు, మరోవైపు మార్కెట్ యార్డులు చీనీ రైతులను నిలువునా ముంచేస్తున్నారు. దళారులకు తోట వద్దనే అమ్ముకుంటే పది టన్నులకు రెండున్నర టన్నులు సూట్ అని వారికి ఉచితంగా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్ యార్డుకు తరలిస్తే ట్రాన్స్‌పోర్ట్, కూలీల ఖర్చులకు కూడా సరిపోవడం లేదని చీనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టమాట ధరలు దమాల్ :



విక్రయానికి అరటి కాయలను తరలిస్తున్న కూలీలు

10 రోజుల క్రితం 114 బాక్స్‌ల టమాటల బొలేరో వాహనం రూ.1.20 లక్షల ధర పలికేది. ప్రస్తుతం రూ.30వేల నుంచి రూ.10వేల వరకు ధర పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా పంటల ధరలు ఉంటే ఏమి తినాలి, ఏమి పండించాలని రైతులు వాపోతున్నారు. రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర లభించడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పండించే పంటలకు గిట్టుబాటు ధరలు అందలేదు



రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లభించడంలేదు. ప్రతి ఏటా రసాయనిక ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. రైతులు పండించే పంటలకు ప్రతి ఏటా ధరలు క్షీణిస్తూ పోతున్నాయి. నిలకడగా ధరలులేక ఏ పంటలు పండించాలో, ఎలా బతకాలో తెలియని పరిస్థితి నెలకొంది. తాను సాగు చేసిన మిరప పంటను 50 కేజీల బస్తా రూ.130లకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– శ్రీనివాసులరెడ్డి, రైతు, అంబకపల్లె, లింగాల మండలం

కేజీ అరటి రూ.3లకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది :



ప్రస్తుతం అరటి కాయలను కిలో రూ.3 లకు అమ్ముకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. కరోనా విపత్కర సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రభుత్వమే టన్ను అరటి కాయలను రూ.4వేలకు కొనుగోలు చేసి, ప్రభుత్వం రవాణా ఖర్చులను భరించి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తరలించి వలంటీర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేసింది. ప్రస్తుతం అంతకంటే దారుణమైన పరిస్థితి నెలకొంది.

– ప్రభాకర్‌రెడ్డి, రైతు, లింగాల మండలం

రేపు ప్రముఖ వైద్య నిపుణురాలు రాక

– అందుబాటులో ప్లాస్టిక్ సర్జరీ సేవలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ శుక్రవారం ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు(మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తల నొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి బత్చు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కాస్మెటిక్ సర్జరి, హ్యాండ్ సర్జరి, మైక్రో వ్యాక్యులర్ సర్జరి, ట్రామా రీకంస్ట్రక్షన్, బర్న్ సర్జరి, డయాబెటిక్ ఫూట్ సర్జరి, క్రానియో ఫేషియల్ సర్జరి, అన్యో రీకంస్ట్రటివ్ సర్జరి సేవలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఓపీలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఈడిగ సంఘీయుల ఆధ్వర్యంలో చేయూత

– రూ.1.40 లక్షల ఆర్థిక సాయం అందజేత



బ్రహ్మయ్య గౌడ్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న ఈడిగ సంఘం నాయకులు, సభ్యులు

వేంపల్లె : కడప నగరంలోని సన్‌రైజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బ్రహ్మయ్య గౌడ్‌కు బుధవారం ఈడిగ సంఘం ఆధ్వర్యంలో రూ.1.40 లక్షల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఈడిగ సంఘం జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్ మాట్లాడుతూ బ్రహ్మయ్య గౌడ్ రైతు కూలీ పనిచేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే పొలంలో గెనాలు చెక్కే పని చేస్తుండగా.. ఆ క్రమంలో ట్రాక్టర్ ద్వారా ట్రిల్లర్ సేద్యం చేసే డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంవల్ల కాలికి తీవ్ర ప్రమాదం జరిగిందన్నారు. చికిత్స కోసం ఆర్థిక సాయం చేయాలని తమ దృష్టికి రావడంతో ఉమ్మడి కడప జిల్లాతోపాటు కర్నూలు, ఇతర జిల్లాలకు చెందిన ఈడిగ(గౌడ) సంఘీయులు కలిసి ఆర్థిక సాయాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఈడిగ సంఘం నాయకులు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్షణికావేశంతో విలువైన జీవితాన్ని బలి చేయవద్దు



ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవ పోస్టర్లను ప్రదర్శిస్తున్న జేవీవీ రాష్ట్ర కన్వీనర్, తదితరులు

పులివెందుల టౌన్ : విలువైన జీవితాన్ని క్షణికావేశానికి బలి చేయవద్దని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ పి.సనవుల్లా తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాళాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో విచక్షణాశక్తి కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బాలనారాయణ మాట్లాడుతూ ఎలాంటి బాధలు వచ్చినా మద్దతుగా నిలిచేవారు లేక, ఆత్మధైర్యాన్ని నింపేవారు లేక మనుషులు చనిపోతున్నారన్నారు. అనంతరం వారు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనిత, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు దుర్మరణం



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల–ఎర్రగుడిపాడు రైల్వేలైన్‌లో ప్యాసింజర్ రైల్‌లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి అరవింద్ (21) మృతి చెందాడని ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇతను తమిళనాడులోని కంచీపురంకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

కమలాపురం : రైతులు పంటల సాగులో మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంకయ్య, మాధురి, కృష్ణప్రియ తెలిపారు. బుధవారం పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది... కార్యక్రమంలో వరి, వేరుశనగ పంటలను వారు పరిశీలించారు. అలాగే నూనె గింజ పంటలైన వేరుశనగ, నువ్వు, ఆముదం వంటి పంటల పై అవగాహన కల్పించారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతిలో వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి

జమ్మలమడుగు : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని పెద్దముడియం మండల వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ తెలిపారు. బుధవారం పాలూరు మండలంలో భూములను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు వివరించారు.

పంట మార్పిడి చేపట్టాలి

వీరపునాయునిపల్లె : పంటలు సాగు చేసే ప్రతి రైతు పంట మార్పిడి చేపట్టాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని యు రాజుపాలెం గ్రామంలో నిర్వహించిన పొలం రోగ నిర్ధారణ సందర్శన కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా వ్యవసాయ సలహా, సాంకేతిక బదిలీ కేంద్రం సంబంధిత శాఖల నిపుణులు పాల్గొన్నారు. వరి. వేరుశనగ పంటలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ డాక్టర్ అంకయ్య. సైంటిస్టు డాక్టర్ మధురి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

రేపు న్యాక్‌లో జాబ్ మేళా

పులివెందుల రూరల్ : పట్టణంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో న్యాక్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన శుక్రవారం జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ మేకల రాకేష్ తెలిపారు. ఈ జాబ్ మేళాలలో ఏఐఎల్ డిస్కోన్స్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, పుష్కల్, చానల్ ప్లే, ఆదిత్య బిర్లా, సంయు గ్లాస్, జాన్‌డీర్, ఓం ఎలక్ట్రిక్ క్యాబ్స్, యంగ్ ఇండియా వంటి కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఈ జాబ్ మేళాకు 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి ఆయా కంపెనీల వయో పరిమితిని బట్టి టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీ, డిప్లమో, బీటెక్ పూర్తి చేసిన యువతీ యువకులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10వేల నుంచి రూ.25వేల జీతం ఉంటుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9640015507 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

పీఎంజేజేబీవై చెక్కు పంపిణీ



అరుణ కుమారికి పీఎంజేజేబీవై చెక్కును అందిస్తున్న లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ జనార్ధన్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జేఎంఎల్‌బీసీ బ్యాంకర్ల సమావేశంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ జనార్ధన్ రాజీవ్‌నగర్‌కు చెందిన దాసరి అరుణకుమారికి బుధవారం పీఎంజేజేబీవై చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బ్యాంకులలో పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్‌లను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి చేయించాలన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ కృష్ణచైతన్య, అన్ని బ్యాంకుల మేనేజర్లు, డీఆర్డీఏ ఏపీఎంలు, సీఎఫ్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

– ఎస్ఆర్‌సీ కంపెనీ అక్రమాలపై సర్వే



12గంటలకు వచ్చిన వీఆర్వోను ప్రశ్నిస్తున్న మైనింగ్ అధికారి

జమ్మలమడుగు: అనుమతులు లేకుండా జరగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విజిలెన్స్ అధికారులు కన్నెర్ర జేశారు. అంబవరం సమీపంలోని కొండ ప్రాంతంలో ఎస్ఆర్‌సీ కంపెనీ తమ జాతీయ రహదారి పనుల కోసం 22 కిలోమీటర్ల మేర గ్రావెల్ త్రవ్వకాలు చేపట్టింది. దీనిపై ఈ నెల 4న సాక్షిలో కొండను కొల్లగొట్టి ..రహదారి చేపట్టి శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో మైనింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించారు. మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ సిబ్బంది విజయలక్ష్మీ అమ్మణ్ణి, మరో ముగ్గురు సిబ్బంది తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఎంత ఎత్తున తవ్వారు చూసి కొలతలు తీశారు. విచారణ చేపట్టి జిల్లా అధికారులకు నివేదిక ఇస్తామని వారు తెలిపారు.

సహకరించని రెవెన్యూ అధికారులు

తనిఖీకి వచ్చిన మైనింగ్ అధికారులకు మండల రెవెన్యూ అధికారులు సహకారం అందించలేదు. బుధవారం ఉదయం రెవెన్యూ అధికారులకు సమాచారంఅందించి మైనింగ్ జరిగిన ప్రాంతానికి వెళ్లినట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. అప్పటికీ రెవెన్యూ అధికారులు సర్వేయర్లు, వీఆర్వోలు ఎవరూ అక్కడికి రాలేదు. దీంతో మైనింగ్ అధికారులు తాము కొండ తవ్వకాలపై ఆరా తీశారు. మధ్యాహ్నం 12 గంటలకు వీఆర్వోవచ్చారు. ఉదయం పది గంటలకు సమాచారం ఇస్తే ఇప్పుడు వస్తారా అంటూ మైనింగ్ అధికారులు వీఆర్వోపై ఆగ్రహంవ్యక్తం చేశారు. రెవెన్యూ భూముల్లో మైనింగ్ జరుగుతుంటే ఏమి చేస్తున్నారంటూ వారు ప్రశ్నించారు. అయితే రోజూ రేయింబవళ్లు 200 టిప్పర్ల వరకు తరలించిన సిబ్బంది, వారి వాహనాలు ముందే అక్కడి నుంచి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. రెవెన్యూ అధికారులు ముందుగానే సమాచారం ఇచ్చారని మైనింగ్ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు.

కోడిగాండ్లపల్లెలో జ్వరాల జోరు



జ్వరాలతో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

ముద్దనూరు : మండలంలోని కోడిగాండ్లపల్లెలో ప్రతి ఇంటిలో జ్వరాల బారిన పడి ఆసపత్రులపాలవుతున్నారు. గ్రామంలో 15 రోజులనుంచి జ్వరాలు వ్యాపించాయి. నెలలు నిండిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకు జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. గ్రామంలో సుమారు 30 మంది జ్వరాలతో బాధపడుతూ కర్నూలు, అనంతపురం, ప్రొద్దుటూరులోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. స్థానిక వైద్యసిబ్బంది రక్తనమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు. ఇందులో ఒకరికి డెంగీ మరొకరికి మలేరియా కాగా మరి కొంతమంది డెంగీ లక్షణాలు కలిగివున్నట్లు తెలుస్తోంది.

గ్రామంలో లార్వాతోనే జ్వరాలు

జ్వరాల బారిన పడిన కోడిగాండ్లపల్లెలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తమ సిబ్బందితో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామమంతా కలియతిరిగారు. జ్వరాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పిల్లలతో మాట్లాడారు. గ్రామంలో పలుచోట్ల లార్వా గుర్తించినట్లు, నిల్వ వున్న నీటిని తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యశిబిరాన్ని వారంరోజులపాటు నిర్వహించాలన్నారు.

వైద్య సేవలపై డీఎంహెచ్ఓ సమీక్ష

చింతకొమ్మదిన్నె : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు సందర్శించి అనంతరం వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పనితీరుపై ఆయన మాట్లాడుతూ త్వరలో పునరుత్పత్తి, శిశు ఆరోగ్యం (రీ ప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్) 2.0 కార్యక్రమం ప్రారంభం కానుందని, అర్హత కలిగిన ప్రతి దంపతులను ప్రత్యేక ఐడీ ద్వారా నమోదు చేయడం తప్పనిసరి అని తెలిపారు. ఈ గుర్తింపు సంఖ్య, కార్డు ద్వారా దేశ ప్రజలకు వారి ఆరోగ్య చరిత్రను, వైద్య రికార్డులను సరైన విధంగా నిర్వహించుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం గర్భిణుల నమోదు, పూర్తి జనన పూర్వ సంరక్షణ సేవలపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బందిలో సమన్వయలోపాన్ని లేదా పనితీరు లోపాలు ఉన్న సిబ్బంది పై చర్యలు ప్రారంభిస్తామని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రాఘవేంద్ర, భగత్‌సింగ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ మానస, జిల్లా ఆరోగ్య పర్యవేక్షకులు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు నీరు తెప్పించిన ఘనత వైఎస్సార్‌దే

పులివెందుల టౌన్ : అనంతపురం బహిరంగ సభలో సీఎం చంద్రబాబు రాయలసీమకు నీరు ఇచ్చింది మేం అని చెప్పుకోవడం సిగ్గు చేటు అని వైఎస్సార్‌సీపీ నూర్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ తెలిపారు. బుధవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ రాయలసీమకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు నీరు తెప్పించారన్నారు. జీడిపల్లె, బ్రహ్మంసాగర్, హంద్రీనీవా, గండికోట, సీబీఆర్‌కు నీరు తెప్పించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. 2022లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచి కోట్లాది రూపాయలు కేటాయించి పనులు పూర్తిచేయించి కుప్పానికి నీరు తెప్పించిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. మేమే నీరు తెప్పించామని చెప్పుకోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించి ఆరు నెలలైనప్పటికి ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలను కూటమి ప్రభుత్వం శత్రువుగా చూస్తోందన్నారు.

సమస్యలను పరిష్కరించండి



ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావుకు డిమాండ్ల నోటీసు ఇస్తున్న యూనియన్ నాయకులు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనంతో పాటు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావుకు తెలుగునాడు విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించినట్లు ఆ యూనియన్ విద్యుత్ కార్మిక సంఘం ప్రాంతీయఅధ్యక్షుడు బి.మనోహర్ తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి చేస్తున్న కార్యచరణకు సంబంధించి డిమాండ్ల నోటీసును అందించినట్లు తెలిపారు. 17వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈనెల 25వ తేదీ లోపు యజమాన్యం స్పందించి సమస్యల పరిష్కారం కోసం దిగి రాకపోతే తదుపతి కార్యచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి సీవీ వీరారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్ జగదీశ్వర్‌రెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రాంతీయ అధ్యక్షుడు పాట్టిపాడు బాబు, కార్యదర్శి శివప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

పెండ్లిమర్రి: పొలతలలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలో భక్తులు వేసిన కానుకలను దేవాదాయశాఖ అధికారి మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. మల్లేశ్వరస్వామి, పార్వతీదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల కానుకలను లెక్కించగా రూ.29,79,565 లక్షల నగదు, 40 గ్రాముల బంగారు, 5.50 కిలోల వెండి లభించిందన్నారు. ఈఓ క్రిష్ణానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక ఇక్కట్లు



బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ప్రయాణికులతో కిక్కిరిసింది. బస్సుల కోసం ప్రయాణికులు గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. అనంతపురంలో సీఎం చంద్రబాబు పర్యటనకు బస్సులను మళ్లించడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. ఇదే అదునుగా ఆటోలకు డిమాండ్ వచ్చింది.

